క్లుప్తంగా

కలెక్టర్‌కు సన్మానం



ప్రియాంకను సన్మానిస్తున్న భానుమతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): గాంధీపథం ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో సన్మానించారు. నూతనంగా ఏర్పడిన భద్రాద్రి జిల్లాకు అయిదో కలెక్టర్‌గా మహిళ రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీపథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోమ్, క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు భానుమతి పాల్గొన్నారు.

మొహర్రం ప్రత్యేక ప్రార్థన



నిషానీలకు ప్రార్థన చేస్తున్న దృశ్యం

ఇల్లెందు: మొహర్రం సందర్భంగా పట్టణంలోని కొత్త కాలనీ 12వ వార్డులో చిల్లా ముబాకర్ హజ్రత్ నాగుల్ మీరా ఆలీ అబ్బాస్ ఆషూర్‌ఖానాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం అక్కడి మాలిక్ షఫీ చాంద్‌పాషా ఆహ్వానం మేరకు హాజరైన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సిలివేరు సత్యనారాయణ, భక్తులు అలంకరించిన ఆషూర్‌ఖానాలో నిషానీలకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందుకున్నారు. మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను కులమతాలకు అతీతంగా నెలవంకను దర్శనం చేసుకుని అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటారని తెలిపారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న వంశీ

జూలూరుపాడు: సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. శుక్రవారం పడమటనర్సాపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సందర్శించారు. విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న కుక్, వాచ్‌మెన్, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న శోభన్‌బాబు

కొత్తగూడెంఅర్బన్: నేషనల్ హ్యూమన్ రైట్స్ చిల్డ్రన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌హెచ్‌ఆర్ – సీడబ్ల్యూఈఓ) వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ మొహీనుద్దీన్ జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త శోభన్‌బాబు మాట్లాడుతూ.. సంఘం అధ్యక్షుడు పుట్టినరోజు వేడుకలు ఆస్పత్రిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కనకలక్ష్మి, ఆర్గనైజేషన్ సభ్యులు సరస్వతి, ఎమ్‌జీ సురేష్, వీరన్న, రాజకుమార్, రామకృష్ణ, అస్లాం, శివప్రసాద్, రోజా, శోభారాణి, సుజాత, సునీత, రమేష్, సోను తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో బోలెడు సమస్యలు

- కొద్దిపాటి వర్షానికే కురుస్తున్న స్లాబ్
- సెస్ వసూలు చేస్తున్నా సౌకర్యాలు నిల్
- అసౌకర్యానికి గురవుతున్న ప్రయాణికులు



శిథిలావస్థలో కొత్తగూడెం బస్టాండ్

చుంచుపల్లి: నిత్యం వేలాది మంది ప్రయాణికులు వచ్చిపోయే కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. జిల్లాలోనే అతి పెద్ద బస్టాండ్‌గా పేరుగాంచిన కొత్తగూడెం బస్టాండ్‌ను అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టించుకోవడం లేదు. బస్టాండ్ భవనానికి కాలం చెల్లడంతో శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం వచ్చిందంటే స్లాబ్ కురుస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన ప్లాట్‌ఫాంలతో పాటు ప్రయాణికులు కూర్చునే ప్రాంతంలో పైకప్పుకు ఏకంగా రంధ్రాలే పడ్డాయి. ఏళ్లనాటి బస్టాండ్‌కు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. ఆర్టీసీ ప్రయాణికుల నుంచి సెస్ వసూలు చేస్తున్నారు కానీ, సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ఇక బస్టాండ్ ప్రాంగణంలో పెద్దపెద్ద గుంతలు పడడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ ఉంటోంది. ఆ నీటి గుంతల్లో నుంచి ప్రయాణికులు లోపలికి వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే తంతు పరిపాటిగా మారుతోంది. కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో రోజువారి సుమారు రూ.12 లక్షల వరకు ఆదాయం వస్తుంది. జిల్లాలో అధిక ఆదాయం సాధించే డిపోల్లో కొత్తగూడెం రెండోది. ఆదాయ మార్గాలను అన్వేషించడం తప్ప ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు దృష్టి పెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా బస్టాండ్ ప్రాంగణం పర్యవేక్షణ కొరవడంతో చీకటిపడితే మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రాంగణంలో ఎక్కడపడితే అక్కడ ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. అందేకాకుండా యాచకులకు బస్టాండ్ నివాసస్థలంగా మారింది. వీరు ఇక్కడే తిష్ట వేసి వచ్చిపోయే ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారు. రాత్రి సమయాల్లో వీరి ఆగడాలు మరింత ఎక్కువయ్యాయి. ఇటీవల కాలంలో బస్టాండ్‌లో పలు చోరీలు జరిగాయి. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అసాంఘిక కార్యక్రమాలకు బస్టాండ్ ప్రాంగణం అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ పరిసరాల్లో పారిశుద్ధ్యం కొరవబడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక బస్టాండ్ ప్రాంగణంలో వేల సంఖ్యలో ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు బస్టాండ్ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు

అధికారులు బాధ్యత తీసుకోవాలి



కొత్తగూడెం బస్టాండ్ నుంచి ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికుల రాకపోకలు ఉంటాయి. బస్టాండ్‌ను ఆధునికరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం మరమ్మతులైనా చేపట్టాలి. బస్టాండ్‌లో అధికారులు పర్యవేక్షణ మరింతగా పెంచాలి. సంస్థ ఆదాయం పెంచుకోవడమే కాకుండా ప్రయాణికులకు కనీస వసతులు కూడా కల్పించాలి.

– భూక్యా రమేష్, సీఐటీయూ నాయకుడు

మరమ్మతులు చేపడుతున్నాం



బస్టాండ్ చాలాకాలం నాటి భవన సముదాయం కాబట్టి, పగుళ్లు ఏర్పడి వర్షాకాలం కురుస్తోంది. ఇప్పటికే కురుస్తున్న ప్రదేశాలను గుర్తించి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నాం. బస్టాండ్ ప్రాంగణంలో సిబ్బందితో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పర్యవేక్షణ చేయిస్తాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డీఎం, కొత్తగూడెం

పదోన్నతులు కల్పించండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చుంచుపల్లి: తెలంగాణ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పులికంటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. 22 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. సర్వీసు మొత్తం ఒకే క్యాడర్‌లో ఉండిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత మండలాలు పెరగడంతో ప్రమోషన్లు వస్తాయనుకున్నామని, ఇప్పుడు వీఆర్వోలను మండలాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడంతో అది కూడా వీలు లేకుండా పోయిందని వాపోయారు. సమావేశంలో జనరల్ సెక్రెటరీ కొట్టి రామకృష్ణ, ట్రెజరర్ పెరుమాళ్ల అజయ్, విజయ్‌కుమార్, జయ, శర్మ, కరుణాకర్, యాకూబ్ జానీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధితులకు ఇళ్లు నిర్మించాలి

కొత్తగూడెంఅర్బన్: పాతకొత్తగూడెం వరద బాధిత పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. బాధితులకు స్వయంగా భోజనం వడ్డించి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే వరద పునరావాస బాధితులకు రెండు నెలల్లో ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. వీరికి ఏటా ఇదే పరిస్థితి అని ఈసారైనా ఎమ్మెల్యే హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గంధం మల్లికార్జున్‌రావు, చెనిగారపు నిరంజన్ కుమార్, గుడివాడ రాజేందర్, సందేల సందీప్, హరికృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించండి

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యుత్ సౌకర్యం కల్పించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేజీబీవీ ఉపాధ్యాయ బృందంతో కలిసి శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. 2019లో నిర్మించిన కేజీబీవీ కళాశాల భవనానికి నేటికీ విద్యుత్ సదుపాయం లేక బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. స్పెషలాఫీసర్ భూక్యా సంతు, శాంతి, జ్యోతి, లక్ష్మి, కనకమ్మ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతపై స్థానికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సుజాతనగర్: బీటీ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తూ కోయగూడెం గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. కోయగూడెం రైల్వే వంతెన సమీపంలో ఇటీవల వేసిన బీటీ రోడ్డుకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలో రోడ్డు వేసే సమయంలోనే నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ పనులను అడ్డుకున్నామని, అయినా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా రోడ్డు వేయడంతో ఈ దుస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ద్వారా మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 25వ తేదీ నుంచి 27 వరకు అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ బి.నాగముని నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.5,080 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

సంఘం నుంచి తొలగింపు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం నుంచి యర్రగాని కృష్ణయ్యను బహిష్కరించినట్లు సంఘం (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి బి.మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ నిబంధనావళికి భిన్నంగా వ్యవహరిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

28 నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవం

కొత్తగూడెంటౌన్: ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పట్టణాల్లో, గ్రామాల్లో విప్లవ పట్టుదలతో పాటించాలని, మావోయిస్టు మణుగూరు–పాల్వంచ ఏరియా కమిటీ కార్యదర్శి సూర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించకుండా పోరాటాలను అణచివేస్తున్నారని, అభివృద్ధి నిరోధక ఫాసిజాన్ని ఓడిద్దామని పిలుపునిచ్చారు.

గెస్టు లెక్చరర్లకు అన్యాయం

ఇల్లెందు: తెలంగాణ వ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1,654 మంది గెస్ట్ లెక్చరర్లను తొలగించటం అన్యాయని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐర్ప రాజేష్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. వారంతా త్రీ మెన్ కమిటీ ద్వారా నియమించారని గుర్తు చేశారు. నిబంధనల ప్రకారం పీజీలో మెరిట్ ఉండి ముఖాముఖి, డెమో ద్వారా ఎంపికై పదేళ్లుగా పని చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని తొలగించటం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు.

అధ్వానంగా కేటీపీఎస్ రోడ్డు



గుంతలు పడిన కేటీపీఎస్ రోడ్డు

పాల్వంచ: పట్టణంలోని అల్లూరి సెంటర్ నుంచి కేటీపీఎస్ కర్మాగారాల మీదుగా పాండురంగాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షాల కారణంగా అడుగడుగూ లోతైన గుంతలు ఏర్పడ్డాయి. కర్మాగారాలకు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు అధ్వానంగా మారింది. పాండురంగాపురం, సురారం గ్రామల ప్రజలతో పాటు, ప్రశాంత్ కాలనీ, వెంగళరావు కాలనీ వాసులు, కేటీపీఎస్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడు రోడ్డుపై గుంతల్లో నీళ్లు నిలుస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారతున్నాయి. అధికారులు తక్షణం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పల్లెలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



రేపల్లెవాడలో గ్రామపెద్దలతో సమావేశమైన ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: ప్రతి పల్లెను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలో రేపల్లెవాడ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామ పెద్దలతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పలు వీధులలో సీసీ రహదారులు వేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మూడు రహదారులకు సీసీ రోడ్లు వేసేలా అంగీకారం తెలిపారు. భవిష్యత్‌లోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. స్థానిక సర్పంచ్ అలెం కౌసల్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బంగారు పోగుల బహూకరణ..

ఇటీవల గ్రామంలో ఓ వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ క్రమంలో వృద్ధుడు వాల్యా తనకు చెవి పోగులు కావాలని హరిప్రియను వేడుకున్నాడు. స్పందించిన ఎమ్మెల్యే వాటిని తెచ్చి శుక్రవారం వాల్యాకు బహూకరించారు.

నేడు గిరిజనేతరుల ర్యాలీ, సభ

టేకులపల్లి: ఏజెన్సీ చట్టాలైన 1/70, పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా (పెసా), 2006 అటవీ హక్కు చట్టం తదితర చట్టాలను, ఆదివాసీ, గిరిజనులను గౌరవిస్తూ ఏజెన్సీలో గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం టేకులపల్లి మండల కేంద్రంలో జరిగే ర్యాలీ, సభను జయప్రదం చేయాలని ఏజెన్సీ గిరిజనేతరుల హక్కుల సాధన సమితి నాయకులు లక్కినేని సురేందర్‌రావు, ధర్మపురి వీరబ్రహ్మాచారి, గుడిపూడి మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఏజెన్సీలో గిరిజనేతరులకు నివసించే హక్కు కల్పించాలని, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను గిరిజనేతరులకు కూడా అమలు చేయాలని, ఏజెన్సీలో పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్లతో ఉదయం 10 గంటలకు బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. తరువాత వ్యవసాయ మార్కెట్ యార్డులో సభ ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీలందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

ఓటర్ల నమోదు ప్రక్రియపై శిక్షణ



టేకులపల్లి తహసీల్‌లో ఓటర్ల నమోదుపై శిక్షణ

చుంచుపల్లి: గ్రామాల్లో ఓటర్ల సవరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సాయం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశిత సమయంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ రాజేశ్వరి, ఆర్‌ఐ మంగ్యా నాయక్, బీఎల్వోలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓలకు ఓటర్ల నమోదు ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ రంగాప్రసాద్ మాట్లాడుతూ.. ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి అక్టోబర్ ఒకటి నాటికి 18 నిండిన నూతన ఓటర్ల నమోదు, మృతి చెందిన ఓటర్లు గుర్తించి వారి పేర్లను తొలగించాలని, చిరునామా మార్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ హచ్యా, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

టేకులపల్లి: కొత్తగా ఓటు హక్కు కావాల్సిన వారు, ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు చేయాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని టేకులపల్లి తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్‌లో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, ఓటరు జాబితాలో పేరు ఉన్నదో లేదో సరి చూసుకోవాలని, ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆఓ ఠాకూర్ రాంసింగ్, రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ



మురుట్ల చెరువు అలుగు వద్ద యువకుల సందడి

ఇల్లెందురూరల్: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చిన్నపాటి చెరువులు మత్తడి పోస్తుండగా పెద్ద చెరువులకు భారీగా వరదనీరు చేరుతోంది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇదిలాఉండగా మస్సివాగు కట్ట చెరువులు అలుగుపోస్తుండటంతో మస్సివాగు ఉధృతి పెరిగింది. దీంతో మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట, మానుకోట జిల్లా బయ్యారం మండలం నారాయణపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ఉధృతిని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ శుక్రవారం స్వయంగా పరిశీలించారు. మాట్లాడుతూ.. మేడికుంట వద్ద మస్సివాగుపై వంతెనకు త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

టేకులపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా టేకులపల్లి మండలం రామచంద్రునిపేట పంచాయతీలోని మురుట్ల (పారికలవాగు) చెరువు అలుగు పోస్తోంది. అలుగు వద్ద అందమైన జల ప్రవాహం ఉండటంతో స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువతీ, యువకులు శుక్రవారం అలుగు వద్దకు చేరుకుని జలకాలాటలతో సందడి చేశారు. చేపలు పడుతూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

మణిపూర్ ఘటనకు బాధ్యులను శిక్షించాలి



ఇల్లెందు: పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ర్యాలీ



జూలూరుపాడు: మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మణిపూర్‌లో మహిళలపై రెండు నెలలుగా జరుగుతున్న సంఘటనలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని పలువురు కోరారు. ఈ మేరకు శుక్రవారం మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ), ఎస్‌ఎఫ్‌ఐ, ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, సీఎం, పీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. వక్తలు మాట్లాడుతూ.. మూడు నెలలుగా మణిపూర్‌లో మైటీ, కుకి జాతుల మధ్య ఘర్షణలను అదుపులో చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు విఫలమయ్యారన్నారు. ముఖ్యమంత్రి బీరన్ సింగ్, ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెలో భాగంగా జీపీ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారం 16వ రోజు కొనసాగింది. మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమ్మె శిబిరాలను టీఎస్‌టీడబ్ల్యూయూ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ నాయకులు వేర్వేరుగా సందర్శించి మద్దతు తెలిపారు. పలువురు మాట్లాడుతూ.. జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో పారిశుధ్య లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లిలో ఒంటి కాలిపై నిరసన తెలియజేస్తున్న జీపీ కార్మికులు



పాల్వంచ: అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం



చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో..



జూలూరుపాడు: జీపీ కార్మికులకు మద్దతు తెలుపుతున్న ప్రజాపంథా పార్టీ నాయకులు



అటెన్షన్ ప్లీజ్

జంగాలపల్లికి వెళ్లేదెట్టా..?

టేకులపల్లి మండలం బర్లగూడెం పంచాయతీ జంగాలపల్లికి వెళ్లాలంటా నరకయాతనే. అసలే కచ్చా రోడ్డు. ఇక వర్షం పడితే నానా అవస్థలు. దశాబ్దాలుగా పాలకులు మారుతున్నా.. ఈ ఊరు మాత్రం పక్కా రోడ్డు నోచుకోవడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వెళ్లాలన్నా అష్టకష్టాలు పడాల్సిందే. ఎన్నికల సమయంలో పాలకులు రావడం హామీలు ఇవ్వడం ఆ తరువాత ముఖం చాటు వేయడం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి జంగాలపల్లికి పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 92814 79238